క్లుప్తంగా

రేపు రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎక్స్‌పో-2023



తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎక్స్‌పో-2023ను ఈనెల 15న స్థానిక ఎన్జీఓ కళ్యాణమండపంలో నిర్వహించనున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత తెలిపారు. మహిళా సాధికారతను ప్రోత్సహించే మార్గంలో కొత్త మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను ప్రోత్సహించే లక్ష్యంగా ఎక్స్‌పో-2023ను నిర్వహించనున్నట్లు విలేకరుల సమావేశంలో వివరించారు.ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎక్స్‌పోలో మహిళలు తయారుచేసిన వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. వీరితో వరలక్ష్మి, కల్యాణి, గాయత్రి, సృజన, జ్యోతి ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి



తెనాలిఅర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన దోమల వ్యాప్తిని నియంత్రించ వచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం, మలేరియా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ముత్తింశెట్టిపాలెంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. అందరు తమ ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల వల్ల దోమల వ్యాప్తి పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, మలేరియా సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే..



తెనాలిఅర్బన్: విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాంటిస్సోరి కిండర్ గార్డెన్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేమ్స్ మోర్లే పేర్కొన్నారు. నందులపేటలోని మాంటిస్సోరి కిండర్ గార్డెన్ స్కూల్‌లో ఇంగ్లిష్, మ్యాథ్స్, హిందీ వంటి సబ్జెక్టులలో క్రియేటివ్ కాంటెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు తాము రూపొందించిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కరిమా, రేఖ, సత్యశ్రీ, బదరున్నీసా పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్‌లో దసరా వేడుకలు



తెనాలిఅర్బన్: దసరా వేడుకలను బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ తెలుగు పండుగలలో దసరా పండుగకు చాలా విశిష్టత ఉందన్నారు. తెలుగు సాంప్రదాయాలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో అందరు జీవించాలని అభిలషించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు 'గంగలో విష నాగులు' పుస్తకావిష్కరణ

గుంటూరు వెస్ట్: బ్రాడీపేట ఒకటో లైనులోని బ్రాహ్మణ సమితిలో ఆదివారం ఉదయం 9:30 గంటలకు గంగలో విషనాగులు అనే ఆంగ్ల పుస్తక తెలుగు అనువాదాన్ని మాజీ డీజీపీ అరవిందరావు ఆవిష్కరిస్తారని థింక్ సంస్థ నిర్వాహకులు డి.ఎస్.ఆర్. మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక రచయిత సారంగపాణి, ఎం.సుధామోహన్, సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్. సాయి తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆధునిక భారతావని ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అంశాలపై ప్రముఖుల ఉపన్యాసాలుంటాయని తెలిపారు.

మాదకద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు

ఎస్ఈబీ అదనపు ఎస్పీ మహేష్

తెనాలిరూరల్: మాదకద్రవ్యాలు, గంజాయిని నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ డీఎస్ మహేష్ తెలిపారు. రాష్ట్రంలో గంజాయి సాగు విక్రయాలను అరికట్టడంతో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఎస్ఈబీ, ఆర్పీఎఫ్, జీఆర్పీ, సివిల్ పోలీసులు తెనాలి రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీల మాక్‌డ్రిల్‌ను శుక్రవారం నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన పోలీస్ జాగిలం 'రెమో' ప్రయాణికుల లగేజీ, ప్లాట్‌ఫాంలు, రైల్వే పార్శిల్ కార్యాలయంలో తనిఖీ చేసింది. ఐదో నంబరు ఫ్లాట్‌ఫాంపైకి జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ రాగా అందులో కొందరి ప్రయాణికుల లగేజీని పరిశీలించడంతో పాటు రైలు భోగీలోనికి వెళ్లి గంజాయి, మాదక ద్రవ్యాలను గుర్తించే ప్రయత్నం చేసింది. ఎస్ఈబీ అదనపు ఎస్పీ మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి సాగుపై కఠినంగా వ్యవహరిస్తుండడంతో ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి రైళ్ల ద్వారా తీసుకువస్తుండడంతో ప్రత్యేక శిక్షణ ఇచ్చిన జాగిలాలతో తనిఖీలు చేస్తున్నామని, ఇందులో భాగంగానే తెనాలి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టినట్టు వివరించారు. గంజాయి, మాదకద్రవ్యాల గురించిన సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 14500కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తనిఖీల్లో తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు, జీఆర్పీ సీఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎల్.సరస్వతి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతేఅలీబేగ్, ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, ఎస్ఐ వినితారెడ్డి, తెనాలి వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు కె. చంద్రశేఖర్, ఎస్. వెంకట్రావు, ఎస్ఐలు, రైల్వే స్టేషన్ మేనేజర్ టీవీ రమణ తనిఖీల్లో పాల్గొన్నారు. పోలీస్ జాగిలం రెమోకు గంజాయి, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు జాగిలం హ్యాండ్లర్ ఆర్.విజయ్‌రాజు తెలిపారు. విజయవాడ రైల్వే డివిజన్‌కు సంబంధించిన జాగిలం కావడంతో ప్రతి రోజు విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైళ్లను తనిఖీ చేయిస్తామని చెప్పారు.



రైలు బోగీలో తనిఖీలు చేస్తున్న పోలీసు జాగిలం రెమో



ప్లాట్‌ఫాంపై తనిఖీలు

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

చివలూరు(కొల్లిపర): ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. గ్రామ సచివాలయంలో పరిధిలోని పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన బ్లాక్‌లో అందిస్తున్న సేవలను పరిశీలించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచి బొంతు వేణుగోపాలరెడ్డి, సిరిపురం సర్పంచి పచ్చవ సులోచనరాణి , వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు అవుతు పోతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కారుమంచి పృధ్వీకుమార్, పచ్చవ రమేష్ , ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నాంచారయ్య, వైద్యులు చిక్కాల లక్ష్మీసుధ, ప్రియాంక, దిలీప్, స్పెషలిస్ట్ డాక్టర్లు కిరణ్, షేక్ కరిముల్లా పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య వైద్యశిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

రేపు రావూరి శివయ్య ప్రథమ వర్ధంతి

తెనాలి: నాస్తిక సమాజం- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక కవిరాజా పార్కులో ఈనెల 15వ తేదీ రావూరి శివయ్య ప్రథమ వర్ధంతి సభ నిర్వహించనున్నారు. నాస్తిక సమాజం, తెనాలి డివిజన్ కార్యాలయంలో శుక్రవారం వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సభను జయప్రదం చేయాల్సిందిగా పీఅండ్‌టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుడు డీఎస్ఎన్ కోరారు. శివయ్య వామపక్ష భావజాలంతో ఉండేవారనీ ప్రజాసంఘాల కార్యక్రమాలన్నింటికీ సహాయకారిగా ఉన్నారని గుర్తుచేసుకున్నారు. నాస్తిక సమాజం నాయకుడు నందూరి నారాయణరావు మాట్లాడారు. ఆర్.శివకృష్ణ స్వాగతం పలికే సభకు కె.బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహిస్తారని, 'మహిళా సాధికారత-మహిళా రిజర్వేషన్లు-పరిశీలన'పై ప్రజాశక్తి బుక్‌హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి ప్రసంగిస్తారనీ, 'భారత సాంస్కృతిక చరిత్ర-సనాతన ధర్మం అంశంపై ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడతారని వివరించారు. కరపత్ర ఆవిష్కరణలో నాస్తిక సమాజం సభ్యులు ఆర్.శివకృష్ణ, సాయి, శ్రీనివాస్, మహేష్, వినోద్ పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దివ్యాంగుడికి ఎలక్ట్రికల్ వీల్‌చైర్ అందజేత

- క్రికెటర్ అంబటి రాయుడు వితరణ
- ఎమ్మెల్యే శివకుమార్ చొరవతో పింఛను రూ.5000లకు పెంపు

తెనాలి: వైకల్యం వల్ల నడవలేని పరిస్థితుల్లో ఉన్న పట్టణ ఆరో వార్డుకు చెందిన ఉయ్యూరు శ్రీకాంత్‌కి క్రికెటర్ అంబటి రాయుడు సాయంతో ఎలక్ట్రికల్ వీల్‌చైర్ అందజేశారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో శుక్రవారం సాయంత్రం రాయుడు వ్యక్తిగత కార్యదర్శి రాహుల్, తెనాలి డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల సమక్షంలో శ్రీకాంత్‌కు అందజేశారు. కేవలం ఒక ఫోన్‌కాల్ ద్వారా ఉయ్యూరు శ్రీకాంత్‌కు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో రూ.3000 వస్తున్న పింఛను మొత్తం రూ.5000 వచ్చేలా చూశారు. ఆయన కార్యదర్శి సునీల్‌కుమార్ తీసుకున్న శ్రద్ధతో ఇప్పుడు శ్రీకాంత్ కోసం అంబటి రాయుడు, ప్రత్యేకంగా రూ.లక్ష విలువైన ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను ప్రత్యేకంగా తయారుచేయించి పంపారు. కార్యక్రమంలో వైష్ణవి విద్యాసంస్థల కరస్పాండెంట్ పాటిబండ్ల శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ అచ్యుత సాంబశివరావు, స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు, చెన్నకేశవరావు, పి.నాగరాజు, రాజేంద్రకుమార్, శ్రీనివాస్, అనిల్‌కుమార్, వలంటీర్ విజయ, కె.గోపీనాథ్, చిరంజీవి, సతీష్ పాల్గొన్నారు.



శ్రీకాంత్‌కు వీల్‌చైర్‌ను బహూకరిస్తున్న దృశ్యం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. తెనాలి మండలం ఖాజీపేటలోని ప్రధాన సెంటరులో పంచాయతీ సిమెంటు బల్లలపై కొందరు మద్యం తాగుతున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. స్థానికులు, పంచాయతీ అధికారులతో మాట్లాడి బల్లలను తీసివేయించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

చిత్రకళా ఉపాధ్యాయుడికి సత్కారం

తెనాలి: రూరల్ మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రకళా ఉపాధ్యాయుడు ఫణిదెపు వెంకటకృష్ణను శుక్రవారం సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.సరళ, ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామసర్పంచి కాకి రమాదేవి, క్రాఫ్ట్ టీచర్ కె.శ్రీనివాసావులు వెంకటకృష్ణను శాలువ, నూతన వస్త్రాలతో సత్కరించారు. చిత్రకళలో అభివృద్ధికి, ఉన్నతస్థాయి డిగ్రీలు, పీజీలు, డిప్లొమాలను సాధిస్తున్నందుకు ప్రోత్సాహంగా సత్కరించినట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొల్లిపర: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పి.ప్రదీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత ఉంటుందని చెప్పారు. మండలంలోని అత్తోట, కుంచవరం, కమతవారిపాలెం, దంతలూరు, శిరిపురం, చివలూరు, కొల్లిపర గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు. విద్యుత్ కార్యాలయం సంబంధించిన ఫోన్ నంబరు సాంకేతిక కారణాలతో పనిచేయడం లేదని గమనించాలని చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మండల గ్రామం నందివెలుగు శివారులో పేకాటాడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శుక్రవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న వారిలో ఇద్దరు చిక్కగా ఘటనాస్థలంలో రూ.1150, రెండు బైక్‌లను స్వాధీనపర్చుకున్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: కాళీమాత దేవస్థానం కమిటీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం శివాజీచౌక్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 30వ శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యర్రు శ్రీనివాసరావు, కందేపి సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

16న మున్సిపల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 16వ తేదీ నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో-అప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

జాషువా సాహిత్యంపై పోటీలు

తెనాలి: గుర్రం జాషువా కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాషువాపై వ్యాసరచన, పద్యపోటీలను నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయిని అస్మతున్నీసా పర్యవేక్షించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో విజేతలకు ఒకటో వార్డు కౌన్సిలరు గెడ్డేటి సురేంద్ర జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహూకరించారు. కళాపరిషత్ చైర్మన్ పెద్దీటి యోహాను, డాక్టర్ రంగిశెట్టి రమేష్ నవయుగకవి చక్రవర్తి గుర్రం జాషువా గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం కలిగించే ఉద్దేశంతో జాషువా సాహిత్యంపై పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యాకమిటీ చైర్మన్ మధిర రాజు, కార్యదర్శి జి.ఎస్.రాజు, ఉపాధ్యాయులు ప్రకాష్‌రావు, వెంకటరమణ, ఝాన్సీ, ఆదిలక్ష్మి, ప్రసూనాదేవి, ప్రసాద్, హరినాథ్, శ్రీనివాసరావు, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో అతిథులు

విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులలో శిక్షణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులలో శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ట్రైనర్ పి.ఝాన్సీ మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్ ప్రాజెక్టును యూఎస్‌ఓ సాఫ్ట్‌వేర్ ద్వారా ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. మల్టీమీటర్ డిజిటల్ ఎనలాగ్ మీటర్‌ను ఉపయోగించి ఓల్టేజ్ వాల్యూ, రెసిస్టెన్స్ వాల్యూను ఎలా కనుగొనాలో శిక్షణ ఇచ్చారు. ఒకేషనల్ ట్రైనర్ పి. కాత్యాయని మాట్లాడుతూ పత్తి నుంచి దారం తీయటం, రంగులు అద్దడం, చేనేత చీరలు, పంజాబీ డ్రస్ మెటీరియల్స్ ఎలా నేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీ రవి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శివకుమార్, శాంత, అరుణ విమల, సరోజా పాల్గొన్నారు.



కేఎల్‌యూలో ఒకేషనల్ కోర్సులలో శిక్షణ తీసుకున్న రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు

యువ వ్యాపార వ్యవస్థాపకులకు ప్రత్యేక శిక్షణ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఆర్థిక సహాయం నిమిత్తం యువత రిజిస్ట్రేషన్ మరియు అప్లికేషన్ వివరాలు, అర్హతలు ఇంటర్‌నెట్‌లో పొందుపరిచిన అంశాల గురించి వివరించారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె. హేమదివ్య మాట్లాడుతూ ఖాదీ గ్రామీణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. నవసమాజ నిర్మాణం, అభివృద్ధి గ్రామీణ అభివృద్ధితోనే ముడిపడి ఉందని అన్నారు. ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రవేశపెట్టిన పలు రకాల పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

యువత దేశభక్తి కలిగి ఉండాలి

కేఎల్‌యూ డీన్ హనుమంతరావు

తాడేపల్లిరూరల్: యువత దేశభక్తి కలిగి ఉండి, సామాజంలో క్రమశిక్షణతో నడుచుకోవాలని కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు సూచించారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కలశ యాత్రను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా యువత నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి బియ్యం, మట్టిని సేకరించి ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులతో కలసి కలశ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్లు మౌనిక, పావని, హాబీ క్లబ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుభాకరరాజు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్లు డాక్టర్ అబ్దుల్ బాసిత్, డాక్టర్ ఆర్. సుప్రియ, పి.సురేష్, జి.చంద్రశేఖర్, డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.



మేరా మట్టి మేరా దేశ్‌లో భాగంగా కలశ యాత్ర నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి

లక్ష్మీపురం: ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని, లేని పక్షంలో ప్రజల జీవితాలు మరింత దుర్భరంగా మారుతాయని సీనియర్ అర్థశాస్త్ర అధ్యాపకుడు సి.సుబ్బారెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మేధావుల చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో ప్రజల నిజ ఆదాయాలు తగ్గుతున్నాయని తెలిపారు. కుటుంబ అవసరాలకు చేసే రుణాల వల్ల వారి పొదుపు మొత్తాలు క్షీణిస్తున్నాయని చెప్పారు. వైద్య వ్యయంలో ప్రభుత్వాలు 53 శాతం మాత్రమే ఖర్చు చేస్తుండగా, ప్రజలు తమ జేబుల నుంచి 47శాతానికి పైగా భరించాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

నేతన్న విగ్రహ ఏర్పాట్లు పరిశీలన

మంగళగిరి: మంగళగిరి ఎన్ఆర్ఐ జంక్షన్‌లో ఏర్పాటు చేయనున్న నేతన్న విగ్రహ ఏర్పాట్లును ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ చేనేతకు ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిన మంగళగిరిలో చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే చరిత్ర మరువని విధంగా నగర ముఖద్వారంలో నేతన్న విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. చేనేత వృత్తి ప్రాముఖ్యత యావత్ దేశానికి తెలిసేలా జాతీయ రహదారి పక్కన నేతన్న విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.60 లక్షలతో నగర ముఖద్వారంలో జాతీయ జెండాతో పాటు నేతన్న విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఒక్క నేతన్న విగ్రహం ఏర్పాటు మాత్రమే కాక రూ.4 కోట్లతో చేనేత భవనం, రూ.3.50 కోట్లతో మగ్గం షెడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కేకు మంగళగిరి నేతన్నలంతా అండగా నిలుస్తారని తెలిపారు. నామినేటడ్ పదవులలోను నేతన్నలకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు రామనాథం పూర్ణచంద్రావు, కాసుల రవి, ఊట్ల పాలశ్రీనివాసరావు పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి తదితరులు

శ్రద్ధగా ఆలకించడంతోనే భావవ్యక్తీకరణకు పునాది

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో శ్రద్ధగా ఆలకించడమనేది భావవ్యక్తీకరణకు పునాది వంటిదని ఏఎన్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జి. అనిత పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంకామ్ ద్వితీయ సంవత్సర నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హైకోర్టు న్యాయవాది వసుమతి పూర్ణిమ తన తల్లి గడియారం ఇందిరాదేవి జ్ఞాపకార్థం స్మారక నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అనిత మాట్లాడుతూ గురువులు చెప్పిన అంశాల్ని శ్రద్ధగా ఆలకించి, వాటిని ఆచరణలో పెట్టడం ద్వారానే విద్యార్థి ప్రగతికి బాటలు పడతాయని తెలిపారు.

రేపు రాజమండ్రిలో పద్మశాలీ అసోసియేషన్ సమావేశం

తెనాలిఅర్బన్: పద్మశాలీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 15న రాజమండ్రిలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రిలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతుందని చెప్పారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ అధ్యక్షత వహిస్తారన్నారు. సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. సభ్యులందరు పాల్గొనాలని కోరారు.

ఆరోగ్య సురక్ష శిబిరంలో 490 మందికి పరీక్షలు

తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 450 మందికి సేవలందించారు. డాక్టర్ హనీఫ్, డాక్టర్ మహిత, డాక్టర్ అంబేడ్కర్, డాక్టర్ మనమథ్‌కుమార్ సేవలు అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిఅర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలివేయనున్నట్లు డీఈ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని చెప్పారు. తెనాలి పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు శేకూరులో బజరంగ్ నేత్ర జ్యోతి కార్యక్రమం

కొరిటిపాడు(గుంటూరు): బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చేబ్రోలు మండలం, శేకూరు గ్రామంలో బజరంగ్ నేత్ర జ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతమైన జీవితం ప్రతి ఒక్కరికీ దక్కాలనే మానవీయ కోణంతో 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అనే సూక్తి స్ఫూర్తిగా నేత్ర జ్యోతి పేరుతో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాన్ని బజరంగ్ ఫౌండేషన్ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. రంగుల ప్రపంచాన్ని సాక్షాత్కారం చేసే కంటిచూపును తిరిగి పొందిన వారి కళ్లలో కనిపించే సంతృప్తి ముఖ్యమనిచ పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీ ప్రజలు అధికంగా ఉన్న చేబ్రోలు మండలంలోని శేకూరు, వీరనాయకునిపాలెం, పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి, తంగెళ్లమూడి గ్రామాల ప్రజలకు శేకూరు కేంద్రంగా నేత్ర జ్యోతి శిబిరాన్ని ఏర్పాటు చేయడం వెనుక జగనన్న సంక్షేమ స్ఫూర్తి దాగి ఉందన్నారు.

పేపరు ప్రకటన

మహారాజశ్రీ తెనాలి 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

G.W.O.P.No:1006/2023

Between:
పుట్టి రాజేశ్వరి .. పిటీషనర్
Vs
నిల్.. ..రెస్పాండెంట్

పై నెంబరు గార్డియన్ ఓ.పి.నెం.1006/2023లో పిటీషనర్ అయిన పుట్టి రాజేశ్వరి అనువారు తన మనుమడు అయిన పుట్టి బాలగణేష్ వయస్సు 10సం॥లు గల మైనర్ యొక్క బాగోగులు చూసుకొనుటకు అతని సంరక్షణ, విద్య మరియు ఎదుగుదల కొరకు తనను గార్డియన్ గా నియమించమని శ్రీ కోర్టువారిని కోరుతూ పై నెంబరు పిటీషనును దాఖలు చేసియున్నారు. కావున సదరు పై విషయమునకు ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ది.30.10.2023వ తేదీన ఉదయం గం. 10.30ని॥లకు స్వయముగాగాని లేదా వకీలు వారి ద్వారాగాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ అభ్యంతరములను తెలుపుకోవలయును. లేనియెడల శ్రీ కోర్టు వారు పిటీషనర్ అయిన పుట్టి రాజేశ్వరిగారికి అనుకూలంగా తీర్పును ఇవ్వగలరని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 30-10-2023

శ్రీమతి ఆలా విజయకుమారి
శ్రీ ఎ.కిరణ్‌కుమార్
పిటీషనర్ తరపు న్యాయవాదులు,
తెనాలి. సెల్ : 8501976789